కవితా కౌముది

# అజేయం

టి.శ్రీవల్లీరాధిక

**అలుసివ్వకపోతే**
ఏ కోరికా
అగ్నిశిఖ అయి కాల్చలేదు,
ఆజ్యం పోయకపోతే
ఆకర్షణ ఒక్కటే
మంటను రగల్చలేదు !

అచలంగా మనం నిలబడితే
ఆరాట వీచికలు
మనల్ని కూల్చలేవు,
ఆత్మతృప్తిని వీడకపోతే
ఏ ప్రలోభపు పడగలూ
మనల్ని పతనానికి జార్చలేవు!

అందరికన్నా పైనున్న వాడిపై
చూపు నిలిపితే
అల్పాసక్తులు
మన తలని క్రిందికి దించలేవు,
అసలు మారనివాడితో
చేయి కలిపితే
అవకాశవాదాలు
మన వ్యక్తిత్వాన్ని మార్చలేవు !

***

# పగిలిన స్వప్నాలు

అరుణ దొంతరాజు

**మండుతున్న ఎడారిలో** దప్పికైన బాటసారి
వెదుకుతున్న ఒయాసిస్సు ఎండమావి భ్రమలైతే ,
ఆశలనే దీపాలని కన్నుల వెలిగించుకుంటూ
పెనుగాలులు ఆర్పకుండ కనురెప్పలు కాపాడుతుంటే ,
తడి ఆరని నీ కళ్ళ ఒత్తికి చమురందనీవు..!
ఎన్నాళ్ళీ బ్రతుకుపోరాటం.. నడి సంద్రంలో పడవప్రయాణం
తిమిరాంధకారాన నడిరేయి ఝామున
బ్రతుకు బంగరు నావ వెదుకుతున్నది త్రోవ
దూరాల భ్రమలిడిన దీపస్తంభపు దివ్వె
దాపు జేరిన - గుంపు మిణుగురులై నవ్వె!!!

***



# నిర్వేదం

జ్యోతిర్మయి

**చెట్టు మీద పిట్ట ఒకటి జాలిగా చూసింది**
ఒంటరి నక్షత్రం బాధగా నిట్టూర్చింది!

ఆనవాలు లేని అలజడేదో...
తొంగి తొంగి చూస్తోంది!
ముక్కలైన రోజులన్నీ...
చీకటి మాటున మెసలుతున్నై !

నిన్న మానిన గాయం
కొత్త మందును కోరుతోంది!
మరచిపోయిన సంగతేదో...
దిగులుకు తోడై వచ్చింది!

అంతులేని విషాదానికి
పాత చిరునామా దొరికింది !
నిలకడలేని ఆలోచన
అంధకారాన్ని ఆశ్రయమడిగింది!

రాలిపోయే ఉల్కను చూసి
ఎగిసే అల విరిగింది!!

***

# మనోవేదన

వేమూరి విజయలక్ష్మి

(శాశ్వతమైన బాంధవ్యబంధంలో పరిస్థితులు తెచ్చిన అపశృతులు
భిన్నమైన దృక్పథాలతో జీవన పయనంలో వచ్చిన అనుకోని మలుపులు.)

**బయటకి ఉరికిన మనోవేదనా జలపాతాలు**
వెనుకకు తిరిగిన గత దినాల ఛాయా చిత్రాలు
ముందుకు తరిమిన నిష్టూరాల భావావేశాలు
ఇరువురికి తెలిసిన మలినమైన అంతరంగాలు
అతలాకుతలమై ఉబికిన మాటల తూటాలు
పలువురికి కలిగిన ఇరుకైన ఆలోచనలు
అందరికి నచ్చని కలవని జీవితాలు
ఇంకా ఎందుకు భ్రమ అంతా మామూలుగా ఉందని
ఇంకా ఎంతకాలం వోర్పు సవ్యంగా ఉండాలని
పైకి తేలని స్వార్థపూరిత ప్రణాళికలతో
ఎంతకాలం మోసపోయేది తేనే పూసిన మాటలకు!
ఎవరి జీవితం వారిది, ఎవరి పథకాలు వారివి
ఎవరి దృక్కోణాలు వారివి , ఎవరి సమర్థింపులు వారివి
అలవిగాని చోట అధికులమనరాదు
స్థానబలము కన్నా తన బలిమి లేదయా
ఎగిరిపో నీ స్వేచ్ఛా ప్రపంచంలోకి
వదిలిపో ఇరుకైన బంగారు పంజరంలోనుండి
రోజులలోకి వచ్చింది నీ నివాసం ఇక్కడ
రాజు కంటే తృప్తి ఉన్నవాడు బలవంతుడు
రాజరికం ఇవ్వదు మనశ్శాంతి
ఆకలి రుచి ఎరుగదు
నిద్ర సుఖమెరుగదు
పరుషమైన మాటలతో పంచభక్ష్య పరమాన్నం కంటే
పరువైన బ్రతుకులో పచ్చడి మెతుకులు రుచి

****

# అమ్మాయిలూ జాగ్రత్త

కోసూరి ఉమాభారతి

**ఉన్మాదితో సయ్యాటలు, నిప్పుతో చెలగాటాలు**
ముసుగేసిన కరుకుతనం, గుర్తించని పసితనం
కొరివితో గాఢస్నేహం వదులుకో!
తెలివితో సన్మార్గాన నడుచుకో!
ముగ్ధమనోహర రూపమంటాడు
పంచదార చిలక పలుకులంటాడు
ఇంతీ, చేమంతీ. పూబంతీ అంటూ
వెనువెంటే ఉంటూ, తికమక పెడతాడు
నీ చూపులు, నీబాసలు చాలునంటాడు
నీ ఎడబాటుని సహించలేనంటాడు
తన తడబాటుని గ్రహించమంటాడు
పిచ్చివాడ్నై, నీకై రచ్చకెక్కానంటాడు !
తెరతెరుగని అడవితనం వాడిది
సుతిమెత్తని సుకుమారం నీది
ఎదుటపడకు, ఆశలు రేపకు
నిరాశ ఎదురైతే ఆవేశ పడతాడు!
కళ్ళల్లో విషం, గుండెల్లో కల్మషం
మరమనిషి వాడు, మనసులేని మగవాడు
కోతవుతాడు, తోకతొక్కిన తాచవుతాడు
అటుపై పగలతో సెగలు కక్కుతాడు
జగమెరిగిన జూదగాడు, అలుపెరుగని వేటగాడు
నీతెరుగని కేటుగాడు, పోటెత్తిన పొగరుబోతు
గుంభనంగా ఉంటే పోలా? విషచుంబనం నీకేల?
చాటుమాటు ప్రేమలకన్న, పెద్దల మాటే మిన్న
వాడికై ఆగకుమా! తూగకుమా! ఏమారకుమా!
లోగిలి వీడకు, తోడేలు పాలవకు
గండు తుమ్మెదల బారినుండి
తేరుకో, పారిపో, రహదారిన సాగిపో!! ***

# అతనొక సైనికుడు

మనస్విని

**తండ్రి పదవీవిరమణ చేస్తున్న రోజైనా**
తల్లి ఆసుపత్రి పాలైన రోజైనా
చెల్లెలి పెళ్ళి చూపులకై వరుడు వస్తున్న రోజైనా
తమ్ముడు డిగ్రీ పట్టా పొందిన రోజైనా
తోడు ఉండలేని ఓ అభాగ్యుడు, అతనొక సైనికుడు

అభేద్యమైన శత్రు స్థావరాలను ఎదుర్కోవాలన్నా
రోజుల తరబడి అన్నపానాలు లేకున్నా
సాటి సైనికులు నేలరాలుతున్నా
గురితప్పని శత్రువు తూటా గుండెలో దిగితున్నా
వెరువని ఓ ధైర్యవంతుడు, అతనొక సైనికుడు

శత్రువు పేల్చిన మందుపాత్రలో విచ్ఛిన్నమైన
తన తోటి సైనికుడి అవయవాలు సేకరించాలన్నా
ఎడతెగని శస్త్ర వర్షం కురుస్తున్నా
క్షతగాత్రులకు ధైర్యం చెప్పి సేవ చెయ్యాలన్నా
ప్రాణాలొడ్డి ముందుకుసాగే ఓ సాహసవంతుడు, అతనొక సైనికుడు

అవినీతి పరులు పందికొక్కుల్లా దేశాన్ని దోచుకొంటున్నా
కులమతాల పేరుతొ తోటి పౌరులు మారణహోమం చేస్తున్నా
ప్రకృతి విలయతాండవం ఆడి ప్రజా జీవనాన్ని ఛిద్రం చేసినా
గ్రీష్మ, శిశిర తాపాలు తాళలేకున్నా
అన్నిటినీ భరించి, దేన్నైనా సహించి
దేశాన్ని కాపాడే ఓ త్యాగశీలి, అతనొక సైనికుడు !!

****

# గొంగళి - నల్లనయ్య బత్తిని తిమ్మగురుడు

**పచ్చనాకు సాక్షిగా**

నా రూపమంటే ఎందరికో పరమ అసహ్యం
పసుపుపచ్చరంగులో నేను
ముళ్ళలాంటి కణుపులేవో..నావొంటిపైన!
నన్ను చూసి అసహ్యించుకునే వారు
సీతాకోక చిలుకను చూసి సంబరపడతారెందుకో!
నాలోని అసలు సౌందర్యమదని ఎరుగరెందుకో!
అందరి చూపులకు
ఉమ్మెత్త పువ్వంటే అందమైన తెల్లని పుష్పం
మరి ఆత్మ సౌందర్యోపాసకుడికి
ఉమ్మెత్త పువ్వంటే దుర్గంధభరిత పుష్పం
మహా మాయావి ఈ పుష్పం
చర్మ సౌందర్యం చూసి
ఆత్మ సౌందర్యం మరచి
అభిమానించి,ప్రేమిస్తే
అది శారీరక వాంఛ కాక
ప్రేమవుతుందా?
నా ఆత్మసాక్షిగా
నేనంటే ఎందరికో అసహ్యం
ఈ భూప్రపంచం మీద
నల్లనిరూపుతో నేను
అందానికి వ్యతిరేకమైనవెన్నో..నా వొంటిపైన
అలాగని నేను బాధపడలేదు
అవమానించవద్దని కోరుతున్నా
నిజమే..నేను నల్లనయ్యనే
మనిషి రూపంలో ఉన్న గొంగళి పురుగునే!!

***

# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

**ఈ గవాక్షమునుండి వీక్షించుచుందు**
చెట్టుచేమ వంక గగనసీమ వంక
రాలు చిన్కుల వంక నీరదము వంక
అడ్డుగా నిల్చు రెండు సౌధాల వంక

**చూడజాలను భువిలోని సొగసులెల్ల**
కాంచజాలను నీలియాకాశమెల్ల
సంకుచితమీ గవాక్షదృశ్యమ్ము నాకు
దానిపై యిరుదెసల సౌధములు రెండు

**ప్రకృతివీధుల పయనింప వలనుగాక**
గోడల వెనుక మ్రగ్గెడు వాడనైతి
కన్నులారగ ప్రకృతిని కాంతుమన్న
ఆకసము తాకు భవనమ్ములడ్డు వచ్చె

**ప్రకృతి తెరపైన నీదు చిత్రమును గీయ**
భావమున నిల్పి నీ రూపు బయలు చూడ
స్పష్టతయె లేమియైన యావరణ తోచె
అద్దమున నాదు బింబమే అడ్డు వచ్చె

**సహజమౌ యీ పుడమి యందచందములను**
కన్నులారగ వీక్షింప గలుగుటెట్లు
పుడమి సొబగులుడిగి చిన్నబోవుచుండె
మనసు ఫలకంపు తలమెల్ల మాయుచుండె

POST YOUR COMMENTS